మెడుల్లా మెలిక

శ్రీ కొలకలూరి ఇనాక్

ఇది కథ కాదు. ఒక సంఘటన్ని కథగా మార్చే ప్రయత్నం.

జరిగిపోయిన ఘట్టంలోని విషయాన్ని కథగా వ్రాయటానికి పూనుకుంటే రచయిత ఎంతవరకు కృతకృత్యుడు కాగలడో పరీక్షించుకుంటున్నాను.

కథకు అవసరమయ్యే ప్రణాళిక సంఘటనకు ఉండకపోవచ్చు. జీవితంలోనూ, రచనలోనూ, అనుభవంలోనూ చిన్నవాణ్ణి కనక ఈ సంఘటనలో వున్న గొప్పతనం ఏమిటో నాకు తెలియటం లేదు. ఏదో బలవత్తర శక్తిమాత్రం కనిపిస్తోంది. అది ఏమిటో నేను పోల్చుకోలేదు.

కథ నీరసంగా వుంటే నన్ను తిట్టకండి; ఇది కథ కాదు కనక.

నాకిప్పుడిరవై సంవత్సరాలు!

నా ప్రవర్తన వయస్సుకంటే అతీతంగా వుంటుందని ఒక అమ్మాయి చెప్పింది. అంతే కాదు అలా కనిపిస్తాను కూడా. ఆ ప్రయత్నం కూడా వుంది.

"నీ వయస్సు ఎంత వుంటే మాకేమిటి?"

నాకు తెలుసు, ఈ ప్రశ్న మీకు కలుగుతుంది. అందుకే జవాబు చెప్పుకుంటున్నాను. ఆలకించండి!

పది సంవత్సరాలనాడు నేను వయస్సుకి మించిన సమన్వయం ఒకటి చేశాను. దాన్నే కథగా మలుద్దామని ఆలోచిస్తున్నాను.

అదే వ్రాయబోయేది.

మా వూరులో హైస్కూలు లేదు. గుంటూరులో వుంది. దూరం ఎనిమిది మైళ్ళు. రోజూ వుదయం రైలు. సాయంకాలం రైలు. అన్నం గుంటూరులో. చదువు హైస్కూలులో. ప్రయాణం రైలులో. ఇదీ పద్ధతి. జేమ్సు నాకంటే పెద్దవాడు. ఇద్దరం కలిసివుండేవాళ్ళం. మేం ఫస్టుఫారం.

మార్చినెల చివరిభాగం.

ఉదయంపూట స్కూలు అయిన తరవాత ఇంటికి వెళ్ళటానికి రైలు లేదు. మూడుగంటలు కాళీ.

షెడ్డుల్లో మాకు క్లాసులు జరుగుతూ వుండేవి. అన్నం కూడా అక్కడే తినేవాళ్ళం. అక్కడే కూర్చుని హోంవర్కు చేసుకునేవాళ్ళం.

టైం ఒంటిగంటయింది. మూడు గంటలకి రైలు. రెండుగంటలు కూర్చోవాలి.

ఊరక కూర్చోవాలంటే నీరసంగా వుంటుంది కదూ! తప్పదు. వుంటుంది. అలా వుండకుండా నే చేస్తాను. ఈ కథ చదవండి! అసలు నేనీకథ వ్రాయటానికి ఆధారం ఆ సంఘటన. సంఘటనలో గొప్పతనం నేను వేరుచేసి చూపలేను. అది విచిత్రమైంది. ఎప్పుడైనా గుర్తువస్తే కదిలించి, కుదిలించి, అల్లల్లాడించి, వూపేసి వెళ్ళిపోతుంది. ఆ వూపు తట్టుకోలేక, మీకు భాగం పంచి, నేను తగ్గించుకుందామని చేసే ప్రయత్నమే కథ వ్రాయటం.

పైన చెప్పినదంతా వట్టి వూక, అది అవసరం లేదు. అనవసరం. అంత అనవసరం కూడా కాదు. అయినా మీకు ఒపికవుంటే నిరభ్యంతరంగా మరిచిపొండి.

అసలు విషయం చెప్పబోతున్నాను.

నెరసిన బొద్దుమీసాల పెద్దవాళ్ళిద్దరు షెడ్డులోకి వచ్చారు.

జేమ్సు జారుకున్నాడు. నాకు భయం కలగలేదు.

ఒకడు నన్నడిగాడు "అబ్బాయిలూ మీతో పని వుంది వస్తారూ?"

కంఠం కరుగ్గా బొంగుపోయినట్టుంది. ముఖం నిర్మలంగా వుంది. విషయం భయం కలుగజేసేట్టుగా వుంది.

తల నిటవాలుగా పెట్టి ఎనభై మైళ్ళ స్పీడ్‌తో ఎడా పెడా వూపాను.

రెండవవాడు బ్రతిమాలాడు

"చిన్నపిల్లలు కావాలి. ఇప్పుడిక్కడ మరెవరూ లేరు అవసరం. రావాలి బాబూ."

నాకు భయం వేసింది. అమ్మ చెబుతుండేది 'దయ్యాలు కూడా మనుష్యుల్లాగా మాట్లాడతారని.'

జేమ్సు లేడు. నన్ను పొడిచాడు. బైటికి పోబోయాడు. బైటివాడు అడ్డంవచ్చాడు.

ఆంజనేయదండకం అమ్మ నేర్పింది కానీ, నాకు పూర్తిగా రాదు.

రెండోవాడు మళ్ళీ అడిగాడు.

ఏవేవో చాలా చెప్పాడు తినుబండారాల పేర్లు; కొనిపెడతాం రమ్మన్నాడు.

అమ్మ చెబుతూవుండే విషయం గుర్తుకొచ్చింది.

మనకు తెలియనివాళ్ళు పెట్టేవి తినకూడదు. అందులో మత్తుమందులు పెడతారు. పిల్లల్ని మాయ చేసి తీసుకెళ్ళి చాలా చాలా దూరంలో అమ్మేస్తారు. పరాయివాళ్లు పెట్టేవి తినకూడదు.

వాకిట్లోని బక్క ముసలతన్ని తప్పుకుపోదామని వంగిపోబోయాను.

ముసలతనికి కోపం వచ్చింది ఎర్రగా నావైపు చూశాడు. నాకు ఏడుపు వచ్చింది.

అమ్మ చెప్పిన విషయం గుర్తుకొచ్చింది.

పిల్లల మెదడు తినే పిచ్చాళ్ళు గుంటూరులో తిరుగుతున్నారు

నాకు ఏడుపు రెట్టింపయింది. జేమ్సు కూడా మొదలుపెట్టాడు.

వాళ్ళిద్దరు మాకు వినిపించకుండా ఏమేమో మాట్లాడుకున్నారు. ఒకతను బైటికి వెళ్ళిపోయాడు.

మరొకతను మంచి మంచి మాటలు చెబుతూ ఓదార్చుతూ మమ్మల్ని బైటికి పోనివ్వకుండా చూస్తున్నాడు.

డ్రిల్లుమాస్టరు సైకిలుతో షెడ్డుదగ్గరకు వచ్చాడు. ఆయనతో పాటు మమ్మల్ని బెదిరించిపోయిన అతను వున్నాడు.

మాస్టర్ని చూడగానే ఆరిపోతున్న దుఃఖజ్వాల ప్రజ్వరిల్లింది.

జరిగిన సంగతి ఏడుస్తూనే ముసలివాళ్ళను ముద్దాయిలను చేస్తూ ఫిర్యాదు చేశాను.

మాస్టరు నవ్వాడు.

స్కూల్లో చేర్పేటప్పుడు మమ్మల్ని గూర్చి మా నాన్న వీళ్లు జాగ్రత్త అని చెప్పినవారిలో డ్రిల్లు మాస్టరు ఒకరు.

నన్నూ, జేమ్సునీ సైకిల్ మీద కూర్చోబెట్టుకొని వాళ్ళ బారినుండి తప్పించుకొని తీసుకువస్తున్నారు మాస్టరుగారు.

మా సైకిల్ వెనుక రిక్షాలో ఆ పెద్దమీసాల ముసలాళ్ళు వస్తున్నారు.

నాకు మళ్ళీ భయం పుడుతోంది. మాస్టరు గారికి వాళ్ళని చూపించాను. "నేనున్నానుగా. భయంలేదు." అన్నారాయన.

మాస్టరు మమ్మల్ని సైకిలు దించారు

వాళ్ళిద్దరూ సైకిల్ రిక్షా దిగారు.

మాస్టరు వాళ్ళవైపు చూశారు. వాళ్లు మమ్మల్ని దాటి ఒక గొందిలోంచి నడుస్తున్నారు. మాస్టరు వాళ్ళవెనక నడుస్తున్నారు.

చెరోప్రక్క మేం నడుస్తున్నాం.

వెనక్కి పరుగెడదామనుకున్నా. కానీ అక్కడ్నుంచి నాకు తోవ తెలియదు. అది నగరం పాలెం.

నా ముఖం ఎలావుందో నాకు తెలియదు. జేమ్సు ముఖం నల్లగా వుంది. వాళ్ళు ఒక యింట్లోకి పోయారు. ఆ తరవాత మాస్టరు పోయారు. ఆయన వెంట మేం వున్నాం.

ఇప్పుడా పూరిపాక స్థలంలో మేడ వుంది.

ఇంతవరకూ మనం అసలు విషయానికి రాలేదు. చెప్పిందంతా చెత్త. అది అసలు కథకేమీ అవసరం లేదు

నిజంగా నేనిదేమీ చెప్పకూడదు. దాని అవసరం లేకపోయిందీ లేదు. మీ యిష్టానికి వదులుతున్నాను. చదవండి. తరవాత, ముందు చెప్పింది అవసరమో కాదో ఆలోచించండి.

సరీగ్గా సంఘటన ప్రారంభంలో మీకు అడ్డం వచ్చాను. తప్పుకుంటాను. కథ చదవండి.

ఆ యిల్లు చిన్నది.

లోపల చిత్రంగా అలంకరణ వుంది. ఇక్కడ మరొక్కడు కనిపించాడు. వాడ్ని అందరూ 'శాంబరీ' అని పిలుస్తున్నారు. వాడి కళ్ళు ఎర్రగా వున్నాయి.

భూమిమీద ఏదో పూజ వుంది పసుపునీళ్ళూ ఎరుపునీళ్ళూ కలిపి భూమిమీద జల్లారు. రంగురంగుల దారాలూ వున్నాయి. పచ్చపచ్చగా ఏవో ఆకులు వున్నాయి. వాడి చేతులో ఏదో జపమాలిక వుంది.

వాళ్లు జేమ్సువైపూ, నావైపూ చూశారు.

శాంబరి నావైపు చూచి నవ్వాడు.

నాకు భయంపుడుతూ చిరాకెత్తింది.

మాస్టరు నాకు చోటుచూపి కూర్చోమన్నారు. ఆ చోటు కొంచెం ఎత్తుగావుంది. కూర్చున్నాను.

శాంబరి ఒక లేత తమలపాకు తీశాడు. దాని మీద కాటుక రాశాడు. ఆపైన నూనెనంటి దేదో వ్రాశాడు; నాకివ్వబోయాడు. నేను తీసుకోలేదు. మాస్టరు తీసుకోమన్నారు. తీసుకున్నాను.

శాంబరి చెప్పాడు.

'నీకు తమలపాకులో ఏం కనిపిస్తే అది కనిపించిందని చెప్పు.'

నేను మాట్లాడలేదు.

'సరే వను' అన్నారు మాస్టరు.

నేను తల వూపాను.

శాంబరి అడిగాడు 'ఏం కనిపిస్తోంది?'

నేను చెప్పాను 'ఆకు'.

'జాగ్రత్తగా చూడు! ఆకులో ఏం కనిపిస్తోందో చెప్పు.'

నేను మాట్లాడలేదు.

'చూస్తున్నావా?'

'ఆఁ!'

'ఏం కనిపిస్తోంది?'

'ఏమీ కనిపించటం లేదు.'

నాకు నిజంగా ఏమీ కనిపించటంలేదు. ఆకు మాత్రం తెల్లగా నల్లగా కనిపిస్తోంది, ఎత్తుపల్లాలవల్ల మెరుస్తూ.

'ఏం కనిపిస్తోంది?'

'ఏమీ లేదు.'

'జాగ్రత్తగా చూడు! కొండ అరచేతిలో పెట్టుకొని ఆంజనేయస్వామి కనిపిస్తాడు. భయపడవద్దు. జాగ్రత్తగా చూడు.'

నేను మాట్లాడలేదు.

'చూస్తున్నావా?' శాంబరి అడిగాడు.

'ఊఁ!' జవాబు చెప్పాను.

'కనిపించాడా?' ముఖంలోకి చూస్తూ మళ్ళీ అడిగాడు.

'లేదు.'

'ఈసారి కనిపిస్తాడు. జడుసుకోకు. జాగ్రత్తగా చూడు, వస్తున్నాడు. జాగ్రత్త! కనిపించాడా?'

'ఏమీ కనిపించటం లేదు.'

చుట్టూ చూశాను. శాంబరి నా ముఖంలోకీ, ఆకునూ చూస్తున్నాడు. వాళ్ళిద్దరూ నావైపు చూస్తున్నారు. జేమ్సు దిగాలుపడి చూస్తున్నాడు. మాస్టరు చూస్తున్నారు.

'అదిగో! వచ్చాడు. కనిపించాడా?'

'ఊఁ!'

ఇప్పటికీ నాకా సంఘటన గుర్తుంది. ఆకులో నాకేమీ కనిపించలేదు. అబద్ధం ఆడకూడదని తెలుసు. కాని కనిపించిందని ఆంజనేయస్వామి కనిపించాడని చెప్పాను. పర్వతంతో కనిపించాడని చెప్పాను. పచ్చి అబద్ధం.

నే నిప్పుడనుకుంటాను. అప్పట్లో ఏదో బలవత్తరమైన ఒత్తిడివల్ల తెగింపు తెచ్చుకున్న చిన్న వయస్సు కారణమని.

శాంబరి ఎగిరి గంతేశాడు.

జేమ్సు నా ముఖంలోకి చూశాడు.

మాస్టరు సిగరెట్టు ముట్టించారు.

వాళ్ళిద్దరూ సర్దుకొని కూర్చున్నారు.

శాంబరి మళ్ళీ అడిగాడు.

'ఆంజనేయస్వామి ఏమో చెబుతాడు. చెబుతున్నాడు విను. ఏం చెబుతున్నాడు?'

'ఏమీ చెప్పటంలేదు.'

'జాగ్రత్తగా విను! ఏదో చెబుతాడు.'

కదలకుండా కూర్చున్నాను.

'మాట్లాడుతున్నాడా?'

నేనుమాత్రం నిశ్శబ్దంగా వూరుకున్నాను. ఆడిన అబద్ధంమీద అంతులేకుండా గోడలు లేస్తున్నాయి. పునాదులు లేని కట్టడాలు.

'ఆంజనేయస్వామి వున్నాడా? వెళ్ళిపోయాడా?'

వెంటనే చెప్పాను 'వెళ్ళిపోయాడు'. చుట్టూ పెరిగిన కట్టడాలు నేలమట్టమయ్యాయి. కొంచెంలో కొంచెం తృప్తి.

'వెళ్ళిపోయాడా? సరే! ఊడలుదిగిన మర్రిచెట్టు పెద్దది కనిపిస్తుంది చూడు!'

జవాబు చెప్పాను 'కనిపించటం లేదు.'

'జాగ్రత్తగా చూస్తున్నావా?'

బుర్ర గట్టిగా వూపాను.

'ప్రవహిస్తున్న నీరు కనిపిస్తోంది కదూ!'

'లేదు.'

'నువ్వు సముద్రం చూశావా?'

'చూడలేదు.'

'నదిని చూశావా?'

'ఉహూఁ!'

'కాలవ చూశావా?'

'లేదు.'

'చెరువు చూశావా?'

'చూశాను.'

'ఆకులో చెరువు కనబడుతుంది చూడు!'

నేను సమాధానం చెప్పలేదు.

'చెరువు కనిపిస్తోంది కదూ!'

'లేదు.'

'నువ్వు చదువుతుంది ఎక్కడ?'

చెప్పాను.

'మీరు కొండవీడు ఎక్స్‌కర్షన్‌కు పోయారు కదూ!'

'అవును.'

'జాగ్రత్తగా చూడు! కొండ కనిపిస్తుంది. చూస్తున్నావా?'

'ఊఁ!'

'కొండ కనిపిస్తోంది కదూ!'

'కనిపించటం లేదు.'

'పెద్ద అడవి కనిపిస్తోంది కదూ!'

'అడవి?'

'అవును. అడవి. చెట్లులూ, కొమ్మలూ, పచ్చగా, నల్లగా, తెల్లగా.'

నేను వూరుకున్నాను.

'కనబడుతోంది కదూ!'

'లేదు.'

'తారు రోడ్డు?'

'లేదు.'

'సిమ్మెంటు రోడ్డు?'

'లేదు.'

'చదునుగా వున్న భూమి?'

'కనిపించటం లేదు.'

'ఎగుడు దిగుడు రోడ్డు?'

'కనిపించటం లేదు.'

'ముళ్ళ డొంక?'

'ఏమీ కనిపించటం లేదు.' నాకు విసుగెత్తింది. శాంబరి గమనించాడు.

'ఎడారి?'

'ఎలా వుంటుంది?'

'ఇసుకలాగా, ఎత్తుపల్లాలతో.'

'ఎక్కడ?'

'ఆకులో!'

'ఏదీ?'

'కనుపించటం లేదా?'

'లేదు.'

వాళ్ళిద్దరిలో నిరాశ, స్పష్టంగా కనబడుతోంది.

మాస్టారు సిగరెట్టు నేలకేసి కొట్టారు. సరిగ్గా సర్దుకొని కూర్చున్నారు.

జేమ్సు ఆవులిస్తున్నాడు.

శాంబరి కోపం పెరిగింది. రౌద్రంగా వున్నాడు. వాళ్ళతో చెప్పాడు.

'కుర్రాడు పనికిరాడు.'

నావైపు తిరిగి నన్ను చూస్తూ 'ప్రయత్నిస్తా' నన్నాడు.

'ఆకులో స్టీమను చూడు.'

శాంబరి నాముఖంలోకి తీవ్రంగా చూస్తూ అడిగాడు.

నేను భయపడ్డాను. అయినా చెప్పాను 'కనిపించటం లేదు.'

'ఆకులో స్టీమను లేదా?'

'లేదు.'

'లేకపోవట మేమిటి? వుంటుంది. చూడు! వుంది. కదూ!'

'లేదు.'

'బస్ స్టాండ్?'

తల అడ్డంగా వూపాను.

'ఏమైనా కనిపిస్తుందా?'

ఆ రోజు నాకిప్పటికీ గుర్తు. అప్పుడు నాలో ఒకరకమైన మార్పు వచ్చింది. మార్పు స్వరూపం ఇదమిత్థమని నిర్ణయించలేను. కోపం కావచ్చు, ప్రేరణ-ఏమో! నిరాశ-ఊహించలేను. బాధ-తిరస్కరణం గూర్చి. దుఃఖం-అప్రాతిమని. అనుభూతి-నరాలలో మెదడులో, మానవత్వంలో. మెలిక-అనుభవంలో, ఆనందంలో, ఆహ్లాదంలో. ముల్లు-గుండెల్లో కండల్లో. డొంక. ఇసుక, మట్టి, ఎడారి- ఇసుక తెరలు, గాలి విసరులు, కొంప, లోయ-పడిపోయిన మనస్సు. ఆకాశం, భూమి, జారిపోయిన తార, సూర్యుడు, చంద్రుడు-కలిసిపోయిన నీడ. పగలు, రేయి, విచిత్రమైన నిప్పు. గడ్డివాము-తగలబడుతోంది. రైలు[illegible]-ప్రాణం పోయింది. చెట్టు మీద-కొమ్మ విరిగింది. చెరువుగట్టు-చేప చచ్చింది. తుమ్మచెట్టు-ముల్లు పెరిగింది. బావిగడ్డ-రావికొమ్మల్లో నిప్పులవేట. మంచుముక్క-గాజుపెంకు చంద్రరేఖ-చూడపింజ. గాలివిసురు-గుండె దిగులు. కంపశాన-నిద్రమత్తు. కునుకు, ఆలోచన. అక్కడ నిప్పులూ నీరులూ. పొగలు. అంగులోంచి భావన, అంతులేని యాతన. నరాలు తెగుతున్నాయి. అంత క్షణంతో—

శాంబరి మళ్ళీ అడిగాడు.

'ఏమైనా కనిపిస్తోందా?'

'హో!' జవాబు చెప్పాను.

శాంబరి ఆశగా చూశాడు.

వాళ్లు కొంచెం కదిలారు.

జేమ్సు నన్ను చూస్తున్నాడు.

మాస్టారు సిగరెట్టు ముట్టించారు.

శాంబరి ప్రశ్నించాడు.

'ఏం చూస్తున్నావ్! కనబడేదేమిటి?'

'బ్రిడ్జి!!!'

ఆకులో ఏ బ్రిడ్జీ లేదు. మరి నేనెందుకలా చెప్పానో, ఇప్పుడూహించుకోగలను. మార్పులు మనం కోరినవి కొన్ని, మన ప్రమేయం లేనివి కొన్ని. ఏ మార్పు ఏలాటిదో అందరికీ అన్ని వయస్సుల్లో తెలియదు. నాకు ఈ మార్పు అంతే.

శాంబరి అడిగాడు.

'క్రింద కొలత వుందా?'

'లేదు.'

'రైలు వుందా?'

'లేదు.'

'రోడ్డు వుందా?'

'లేదు.'

'అసలేం బ్రిడ్జి?'

'మామూలు బ్రిడ్జి. ఓవర్ బ్రిడ్జి. రైలు స్టేషనులో వుండే ఓవర్ బ్రిడ్జి.'

మరొక్క మారు అబద్ధం. పచ్చి అబద్ధం. వీపమైన నిజం లేని అబద్ధం. ఎందుకు నేనలా చెబుతున్నానో నాకు అప్పుడు తెలియదు. ఇప్పుడు సమన్వయం చేసుకోగలను. సంతోషంతోనో భ్రాంతితోనో బుర్ర పగిలిపోతోంది. మార్పు వొచ్చింది. పరిణామం ఎలా వుంటుందో?

శాంబరికి కుతూహలం హెచ్చింది.

'ప్లాటుఫారం కనబడుతోందా?'

'కనబడటం లేదు.' నిక్కచ్చిగా చెప్పాను

'రైళ్లూ!'

'ఏమీ లేవు.'

'సిగ్నలు కనబడుతోందా?'

'లేదు.'

'బ్రిడ్జి చూస్తూనే వున్నావు కదూ?'

'అవును.'

అప్పుడు నాకు, వాళ్లు శాంబరిని ఏమి అడిగారో తెలియదు. నే నేం చెబుతానో శాంబరికి గానీ, వాళ్ళకు గానీ తెలియదు. వాళ్ళు ఏమి వుద్దేశించారో బహుశా శాంబరికి కూడా తెలియదు. మాస్టారుగారికి తెలుసునేమో!

ఆఖరులో చూచి నేను ఏదో సమాధానం చెబుతాను. శాంబరి ఎదుటివాళ్ళ మనస్సులో వూహించుకున్న ప్రశ్నను గ్రహిస్తాడు. సమాధానం, ప్రశ్న సమన్వయించి వాళ్ళకు జవాబు చెబుతాడు. వాళ్ళకది కుదురుతుంది. శాంబరి ప్రయత్నం ఫలిస్తుంది. శాంబరికి అపజయం లేదుట. నాకుమాత్రం ఆ విషయంలో అప్పుడు చీకాకు కలగలేదు

సరైన సమాధానం దేవుడే చెప్పగలడు. దేవుడి అంశవున్న వాళ్ళు చెప్పగలరు. దేవుడి అంశ నాకు గానీ, శాంబరికి గానీ, పరిస్థితికి గానీ, మూడువిధాల సమన్వయానికి గానీ వుండాలి—సమాధానం సరైతే?

శాంబరి కోపంగా ముఖం పెట్టాడు. ప్రశ్నలు వేయటం మానలేదు. మానితే జవాబు రాదు. జవాబు రాకపోతే డబ్బు రాదు. డబ్బు రాకపోతే పొట్టగడవదు. ఇది అప్పటి భావన.

'బ్రిడ్జిపైన జనం వున్నారా?'

'లేరు!'

'జాగ్రత్తగా చూడు! చూచి చెప్పు! నాకు తెలుసు ఉన్నారు. ఉన్నారు కదూ!'

'అవునవును.'

'ఎంతమంది వున్నారు?'

'ఎక్కువమంది లేరు.'

'తక్కువమంది వున్నారా?'

'చాలా తక్కువమంది వున్నారు.'

'ఎంతమంది?'

'ఇద్దరు.'

వాళ్లు ఆశగా చూస్తున్నారు. ముఖాల్లో తృప్తి చూశాడు శాంబరి ప్రశ్నిస్తున్నాడు.

'ఏం చేస్తున్నారు?'

'ఏమీ చేయటం లేదు. నడుస్తున్నారు.'

'మాట్లాడుకొంటున్నారు. వినపడుతోందా?'

'వినపడటం లేదు.'

'మాట్లాడుకొంటున్నారు కదూ!'

'అవును.'

'ముసలివాళ్లా?'

'కాదు.'

'పసిపిల్లలా?'

'కాదు.'

'మరెలా వున్నారు?'

'కుర్రవాళ్ళు.'

'ఆడవాళ్లా?'

'కాదు.'

'మగవాళ్లా?'

'కాదు.'

'మరి?'

'ఆడఅమ్మాయి; మగఅబ్బాయి!'

'యువకుడెలా వున్నాడు?'

'సదాశివశాస్త్రి అంతగా వున్నాడు.'

'సదాశివశాస్త్రి ఎవరు?'

'మా వూరి.'

'బట్టలు ఎలా వున్నాయి?'

'మా డి. యి. ఓ బట్టలు లాగ వున్నాయి.'

'మహమ్మదీయుడి బట్టలు లాగా వున్నాయా?'

'అవును నెత్తిన ఎర్రని టోపీ.'

వాళ్ళిద్దరు ఒకేసారి అరిచారు.

'వాడే!'

'యువతి ఎలా వుంది?'

'మా అక్క లాగా వుంది.'

'తేడా ఏమీ లేదా?'

'వుంది!'

'ఏమిటది?'

'నా పెటెమీద బొట్టు.'

'మీ అక్క వయస్సు ఎంత?'

'పద్దెనిమిది సంవత్సరాలు.'

'ఓవర్ బ్రిడ్జి దిగారా?'

'కనిపించటం లేదు?'

'వాళ్ళిద్దరూ కనిపించటం లేదా?'

'ఇద్దరూ కనిపించటం లేదు.'

'మరేమి కనిపిస్తోంది?'

'ప్లాటుఫారం.'

'రైలుందా?'

'రైలు చేరింది.'

'ఎటు వెళుతోంది?'

'బెజవాడవైపు.'

ఇక చాలు నన్నాడు శాంబరి. నా చేతిలో అకు తీసుకున్నాడు. వాళ్లతో చెప్పాడు.

'మీ అమ్మాయి కనిపించకపోవటంతో ఏం జరిగిందో తెలుసుకుందామని వచ్చారు. అవునా?'

'అవును.' అన్నారు ఇద్దరూ ఒకేసారి.

'ఒక సాహుకారీయు యువకుడితో లేచి పోయింది. రైలులో బెజవాడ పోయారు. మీరు బెజవాడ పోతే వారు కనిపిస్తారు కాని ఆమె మీతో రాదు. వాళ్ళిద్దరూ మీరు పోయేసరికి పెళ్ళి చేసుకుంటారు.'

వాళ్ళు చప్పున పైకి లేచారు.

మాస్టరు లేచారు సిగరెట్టు ముట్టించుకున్నారు.

శాంబరి చేతిలో డబ్బులు పడ్డాయి.

మా కేవో వాళ్ళు కొని పెట్టారు. మేం తీసుకోలేదు.

మాస్టరు మమ్మల్ని సైకిల మీద ఎక్కించుకొని స్టేషను వైపు నడుపుతున్నారు.

ఇంతవరకు నేను మీకు సంఘటనలోని ప్రాణం అంటే ఘట్టం చూపెట్టలేదు. జరిగిందంతా ఏమీ లేదు. చెప్పబోయే ముఖ్యం ఇది కథ అయితే ప్రాణమైన పట్టు చెప్పబోయే విషయం. తప్పుకుంటున్నాను. కథ చదవండి!

నేమా జేమూన్ని? ఓవర్ బ్రిడ్జి దాటి ప్లాటుఫారం మీదికి వచ్చి రైలెక్కాం. కదిలింది.

నా కప్పుడే ఆలోచనలు వచ్చాయో తెలీదు. కాని ఇప్పుడు మాత్రం ఏదో అనుకుంటాను.

విచిత్రమైన అభిప్రాయం సంబంధిఅనుభూతి. చెప్పిన అబద్ధాలో చెప్పలేనంత నిజం వుంది. విలుక్కీ నీడకీ మధ్య వున్న గోడ పోతే రెండూ ఒకటే. జరిగిన అబద్ధం ఎలా అడ్డాలిగాదు? నా హృదయంలో, మనస్సులో రక్తంలో నరాల్లో ఎక్కడో ఏదో విచిత్రమైన, పరాత్పరాంశవున్న శక్తి పనిచేసింది.

అబద్ధం నానోటలోంచి రావటానికి వెనుక ఏదో నిశ్చలమైన సమాచారానికి సంబంధించిన విషయ విస్తరణ నా మెదడులో తెరలు తెరలుగా, పొరలు పొరలుగా వున్న అనుభవాల ఫలకా మీద ఎక్కడో ఏదో ముద్రపడి వుంటుంది. ఎలాంటి పరిణామం లేకుండా ఇలాంటి విషయాలు ఎవరైనా ఎలాగ చెప్పగలరు? నేను చెప్పిన దానికి కారణం మా అక్క మెట్టిల్లా విషయం నాకు తెలిసి వుండటమేనని నేను ఇప్పుడిప్పుడు ఆవిషయం గుర్తు వచ్చినప్పుడు అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాను.

అక్క ప్రేమగాన నా హృదయ కుహరాంతరాళంలో ఎక్కడో మరుగుపడి పూడిపోయి నిద్రాప్రవృత్తితో సాగుతూవుండి, పరిస్థితులు బలవత్తరమైనప్పుడు పొంగిపోయి పెల్లుబికి నరాలలో ప్రవహించి చైతన్యాన్ని ప్రసాదించి విద్యుత్తుని ప్రసారం చేసి, వికాసాన్ని కలిగించి కంఠంలోంచి అప్పుడు వెలువడిందేమో! ఏమో! ఏదో జరిగింది. అదే కావచ్చు!

రైలు దిగాను.

ఇంటికి వెళ్లాను.

అక్క కనపడలేదు. వచ్చి పుస్తకాలు తీసుకెళ్ళలేదు. ఇల్లు బోసిపోయినట్లుంది. అమ్మ, నాన్న దిగాలుపడి కూర్చున్నారు.

నాన్న అన్నాడు.

'దాన్నెవడో లేపుకు పోయాడు.'

అమ్మ అంది.

'మీ అక్క ఎవడ్నో లేపుకు పోయింది'

నేను అనుకున్నాను 'మా అక్కా సదాశివశాస్త్రి కలిసి లేచిపోతారని నాకు తెలుసు. పదిరోజుల నాడే నాకు తెలుసు.' నాన్నని బెజవాడపోయి రమ్మన్నాను.

పోయివచ్చాడు. పెళ్ళిచేసుకున్నారని చెప్పాడు.

ఇప్పుడు అక్కకు తొమ్మిది సంవత్సరాల చిన్నారి రాణివుంది.

దాన్ని నాకు ఇచ్చి పెళ్ళి చేస్తానని, అక్కా బావా ఇద్దరూ అంటున్నారు.

నేను రాణిని పెళ్ళి చేసుకుంటాను.

ఇంకా సంఘటన ముగియలేదు. పెళ్ళి తరవాత చాలావుంది కథ.